క్లుప్తంగా

నేడు బోనాలు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని పలు కాలనీల్లో ఆదివారం బోనాల పండుగను నిర్వహించనున్నారు. తుర్కయంజాల్, ఇంజాపూర్, రాగన్నగూడలో ఆలయాలను ముస్తాబు చేశారు. మున్సిపాలిటీ అధికారులు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జీఆర్.కరుణాకర్‌కు పరామర్శ



కరుణాకర్‌తో మాట్లాడుతున్న దత్తాత్రేయ

తుర్కయంజాల్: బీజేపీ సీనియర్ నాయకులు జీఆర్ కరుణాకర్ సతీమణి హంసవేణి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం కరుణాకర్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దయానంద్‌గౌడ్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రమేష్, రిటైర్డ్ ఇంజినీర్స్ ఫోరం అధ్యక్షుడు శ్యాంప్రసాద్ రెడ్డి ఉన్నారు.

ఎస్‌ఐలకు సత్కారం



ఎస్‌ఐలను సత్కరించిన శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు ఎస్‌ఐగా బాల్‌రాంనాయక్, కేశంపేట ఎస్‌ఐగా శివశంకర ప్రసాద్‌లు బదిలీపై వచ్చారు. వీరిని శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి సత్కరించి, అభినందనలు తెలిపారు.

పాపన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న గౌడసంఘం నాయకులు

తలకొండపల్లి: బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ప్రతిష్ఠాపన పునర్నిర్మాణానికి గౌడసంఘం ఆధ్వర్యంలో గౌడకులస్థులు శనివారం మండల కేంద్రంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, సర్పంచ్ లలిత, సర్పంచ్ అనిల్, జ్యోతయ్య, గౌడసంఘం మండలాధ్యక్షుడు కుమార్‌గౌడ్, విష్ణు, సురేష్, గణేష్, శ్రీనివాసు, లక్ష్మీకాంత్‌గౌడ్, ముదిరాజ్ మండలాధ్యక్షుడు యాదగిరి, బాలకుమార్, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.


బీమా చెక్కు అందజేత



నాగమణికి బీమా చెక్కు అందజేస్తున్న మేనేజర్ కల్యాణ్

యాచారం: మండలంలోని మల్కీజ్‌గూడకు చెందిన జోగు రవి కుటుంబ సభ్యులకు శనివారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు యాచారం శాఖ రూ.2 లక్షల బీమా చెక్కు అందజేసింది. జోగు రవి అనారోగ్యంతో రెండు నెలల కింద మృతి చెందాడు. గ్రామీణ బ్యాంకులో జోగు రవి ఏడాదికి రూ. 436 ప్రీమియంతో లైఫ్ ఇన్సూరెన్స్ బీమా చేయించుకున్నాడు. అతని మృతితో గ్రామీణ బ్యాంకు మేనేజర్ కల్యాణ్ రవి భార్య నాగమణికి ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా కింద రూ. 2 లక్షల చెక్కు ను అందజేశారు. బ్యాంకుల్లో ఖాతాలున్న వారు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు.

అపహరణకు గురైన సెల్‌ఫోన్లు అందజేత



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న సీఐ

అబ్దుల్లాపూర్‌మెట్: అపహరణకు గురైన సెల్‌ఫోన్లను పోలీసులు శనివారం బాధితులకు అందజేశారు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుంది. సీఐ మన్మోహన్ వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంత్రాల్లో సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయని ఫిర్యాదులు అందాయి. దీంతో కేసు నమోదు చేసుకుని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అపహరణకు గురైన 6 సెల్‌ఫోన్ల ఆచూకీని గుర్తించి బాధితులకు ఎస్‌ఐలు కరుణాకర్‌రెడ్డి, కిషన్ అందజేశారు. బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

లాభాల్లో ‘పట్నం’ డిపో

- నష్టాల నుంచి గట్టెక్కిన ఇబ్రహీంపట్నం డిపో
- రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు సొంతం

ఇబ్రహీంపట్నం: నష్టాల ఊబి నుంచి ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో గట్టెక్కింది. గత కొన్నేళ్లుగా నష్టాల ఊబిలో డిపో కొట్టుమిట్టాడుతోంది. ఎండీగా సజ్జనార్ బాధ్యతలు తీసుకున్న తరువాత ఆర్టీసీలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. నష్టాల్లో ఉన్న డిపోలను లాభాల బాట పట్టించడంలో సజ్జనార్ చేపట్టిన సంస్కరణలు, నిర్ణయాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. నష్టాలను అధిగమించి లాభాలు ఆర్జిస్తూ ఇబ్రహీంపట్నం డిపో రాష్ట్రంలోనే తృతీయ ఉత్తమ డిపోగా అవార్డును సొంతం చేసుకోవడం విశేషం. ఇబ్రహీంపట్నం డిపోలో 118 బస్సులుండగా అందులో అద్దె బస్సులు 50, ఆర్టీసీ బస్సులు 68 ఉన్నాయి. ప్రతిరోజు సరాసరి 38 వేల కిలోమీటర్లు, 40 వేల మంది ప్రయాణీకులు ప్రయాణిస్తుంటారు. అందులో 10 నుంచి 15 వేల మంది విద్యార్థులుంటారు. ప్రతిరోజు 12 నుంచి 13 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. ఏప్రిల్ 2021 నుంచి మార్చి 2022 సంవత్సరం వరకు రూ.27 కోట్ల 24 లక్షల నష్టాలను చవిచూసింది. గత 15 సంవత్సరాలుగా ఈ నష్టాలను పూడ్చుకోలేని దుస్థితి. ఎండీ సజ్జనార్ ఆర్టీసీ ప్రక్షాళనకు తీసుకున్న చర్యలతో ఆ పరిస్థితి మారింది. నష్టాలను అధిగమించి గత ఏప్రిల్ 2022 మార్చి 2023 వరకు రూ.38 లక్షల 80 వేల లభం డిపో ఆర్జించింది. ఈ ఆర్థిక సంవత్సరం 2023 ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రూ.43 లక్షల ఆదాయం దక్కించుకోవడం విశేషం. సుమారు కోటి రూపాయల ఆదాయాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, ఈ డిపోలో ఉద్యోగులు, కార్మికులను కలుపుకొని 640 మంది పనిచేస్తున్నారు. మాల్, మంచాల, కందుకూరు, చౌటుప్పల్, హైదరాబాద్ తదితర రూట్లలో ఎక్కువ సంఖ్యలో బస్సులు నడుస్తాయి. అంతేగాక వివిధ శుభకార్యాలకు అద్దె ప్రాతిపదికన బస్సులను డిపో అధికారులు ఇస్తారు. నష్టాలను అధిగమించి లాభాల బాటలో డిపో పయనిస్తూ రాష్ట్రంలోనే ఉత్తమ తృతీయ డిపోగా అవార్డును, రెండు లక్షల నగదు పురస్కారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అందుకోవడం శుభ పరిణామం.



ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో

“సమష్టి కృషితో లాభాల్లోకి ..



ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో గత సంవత్సరం నుంచి లాభాల బాట పట్టింది. ఎండీ సజ్జనార్ సూచనలు, సలహాలు, కార్మికుల, ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగా నష్టాలను అధిగమించాం. ఇప్పటి వరకు సుమారు కోటి రూపాయల వరకు లాభం ఆర్జించాం. ఈ ఆదాయాన్ని రెట్టింపు చేసేలా కష్టపడుతాం. రాష్ట్రంలోనే నంబర్ వన్ డిపోగా నిలిపేందుకు కృషి చేస్తా.

– అశోక్‌రాజు డిపో మేనేజర్, ఇబ్రహీంపట్నం

చదువు దేశాభివృద్ధికి ఉపయోగపడాలి

ఈసీఐఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థుల చదువులు సమాజాభివృద్ధితో పాటు దేశానికి ఉపయోగపడేలా ఉండాలని ఈసీఐఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్ అన్నారు. శనివారం సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 19వ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా అనురాగ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు కొత్త విషయాలపై పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. అనంతరం అడ్రిన్ ఇస్రో సంస్థ డైరెక్టర్ డాక్టర్ పీవీ రాధాదేవి మాట్లాడుతూ.. కష్టపడితేనే ఫలితం దక్కుతుందన్నారు. ఇస్రో సంస్థ శుక్రవారం ప్రయోగించిన చంద్రయాన్–3 విజయవంతంలో తన భాగస్వామ్యం ఉందని తెలిపారు. అత్యధికంగా రూ.57లక్షల ప్యాకేజీ తీసుకునేందుకు సహకరించిన అసోసియేట్ డీన్ ప్లేస్‌మెంట్ విజయమేరీని ఆమె అభినందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రాఘవ చెరబుడి, కళాశాల అడ్వైజర్ మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్ రామశాస్త్రి, ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శివారెడ్డి, అసోసియేట్ డీన్ ప్లేస్‌మెంట్ విజయమేరీ, డీన్ అకాడమిక్స్ డాక్టర్ నయనతార, విద్యార్థులు, పట్టభద్రులు, ఆచార్యులు పాల్గొన్నారు.



పట్టాలను అందజేస్తున్న ఇస్రో సంస్థ డైరెక్టర్ రాధాదేవి, ఈసీఐఎల్ చైర్మన్ అనురాగ్‌కుమార్

ధ్యానంతో మానసిక ప్రశాంతత



పిరమిడ్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

- ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అంజయ్య యాదవ్
- నస్దిక్ సింగారంలో బుద్ధ మహాధ్యాన పిరమిడ్ ప్రారంభం

యాచారం: ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస అని ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అంజయ్య యాదవ్‌లు పేర్కొన్నారు. మండలంలోని నస్దిక్ సింగారంలో శనివారం బ్రహ్మర్షి పితామహులు శుభాష్ పత్రీజి ఆధ్వర్యంలో నిర్మించిన బుద్ధ మహా ధ్యాన పిరమిడ్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనుషులకు మానసిక ప్రశాంతత కరువైందన్నారు. నిత్యం డబ్బు, రాజకీయ, వ్యాపార, ఉద్యోగాల ఆశతో ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవడం లేదని తెలిపారు. రూ.కోట్లు సంపాదించే వారు కంటికి నిండా నిద్రలేక, ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారని అన్నారు. ప్రతి వ్యక్తి నిత్యం కొద్ది సేపు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతోందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ధ్యాన పిరమిడ్‌లు ప్రారంభించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ శివప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, నస్దిక్‌సింగారం సర్పంచ్ అరుణమ్మ, బీఎస్‌ఆర్ ట్రస్టు చైర్మన్ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడిగా వెంకటేశ్



యాచారం: మండలంలోని తక్కళ్లపల్లి తండాకు చెందిన అంగోత్ వెంకటేశ్ టీపీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. అంగోత్ వెంకటేశ్‌లో కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషించాడు. ఆయన సేవలను గుర్తించిన అధిష్టానం టీపీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడిగా నియమించింది. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కృషి చేస్తానని వెంకటేశ్ అన్నారు.

మండలం కేంద్రం ప్రకటించే వరకు దీక్షలు

వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి



దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించే వరకు దీక్షలు కొనసాగుతాయని వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 13వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని శ్రీనివాసురెడ్డి సందర్శించి మాట్లాడారు. మండల ఏర్పాటుకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నా గట్టుఇప్పలపల్లిని మండలం కేంద్రంగా ఎందుకు ప్రకటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 41 రోజులు దీక్షలు చేశారని, ప్రస్తుతం దీక్షలు చేపట్టి 13 రోజులుగా కొనసాగుతున్న ప్రభుత్వం కనీసం స్పందించడం లేదన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నాలు ఫలితం లేదని వాపోయారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, గౌడసంఘం తాలూకా కన్వీనర్ అశోక్‌గౌడ్, పవన్‌వాల్మీకి, కృష్ణయ్య, రేణురెడ్డి, శ్రీను, మల్లయ్య, కొండల్, పురుషోత్తం, రాధాకృష్ణ, జంగయ్య, నరహరి పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వారం రోజులుగా కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం ఇబ్రహీంపట్నం బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించిన పడమటి అన్వితారెడ్డితో కలిసి సత్తు వెంకటరమణారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రీడింగ్ కార్నర్‌లను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ప్రతి రోజు గ్రంథాలయ తరగతికి విద్యార్థులు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం అన్వితారెడ్డి మాట్లాడుతూ.. అమ్మాయిలు ఏరంగంలోనైనా అబ్బాయిలతో తీసిపోరని.. ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. పేద రైతు కుటుంబానికి చెందిన తాను ఎంతో ఇష్టంతో పర్వతారోహణ చేశానని చెప్పారు. ఎవరెస్ట్ శిఖరంపై సగర్వంగా భారతీయ జెండాను ఎగురవేసి తెలంగాణ ఖ్యాతిని నలుదిశలా చాటానని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ, ఉపసర్పంచ్ భగీరథ్, విద్యాకమిటీ చైర్‌పర్సన్ మస్రత్‌జహా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛ సర్వేక్షణ్’కు ప్రత్యేక చర్యలు

మంచాల: కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డు–2023కు ఎంపికయ్యేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందుకు ప్రభుత్వం జిల్లా పరిధిలోని 560 గ్రామాల్లో 14 గ్రామాలను నామినేట్ చేసింది. మండల పరిధిలో ఐదువేలకు పైగా జనాభా ఉన్న ఆరుట్ల, ఐదువేలకు తక్కువ జనాభా ఉన్న మంచాల పంచాయతీలను నామినేట్ చేశారు. ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాల అమలు తీరు. పచ్చదనం, పరిశుభ్రత, శ్మశాన వాటికల నిర్మాణం–నిర్వహణ, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, తడి,పొడి చెత్త సేకరణ, తాగునీటి సరఫరా, ప్లాస్టిక్ నిషేధం, సేంద్రియ ఎరువుల తయారీ తదితర అంశాలను పరిశీలిస్తారు. నామినేట్ చేసిన గ్రామాల్లో రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలన చేపట్టి కేంద్రానికి నివేదికలు పంపిస్తారు. అనంతరం కేంద్రం నుంచి వచ్చిన అధికార బృందం పరిశీలించి అవార్డుకు ఎంపిక చేస్తారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు.



అవగాహన సదస్సులో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ప్రజల ఆర్థిక ప్రగతికి బ్యాంకుల సహకారం

హైదరాబాద్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ భాస్కర్‌రావు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజల ఆర్థిక ప్రగతికి బ్యాంకులు సహకరించాలని యూనియన్ బ్యాంకు హైదరాబాద్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ కారే భాస్కర్‌రావు పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని టీసీఎస్ ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంకు భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కోటి రూపాయల రుణాలను స్వయం సహాయక సంఘాలకు అందజేశారు. రెండు కార్లకు గాను రూ.17 లక్షలు రుణాలు, రూ.84 లక్షల గృహ రుణాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ.. ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చడానికి నిరంతరం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి లబ్ధిదారులు సహకరించాలని తెలిపారు. మహిళా పొదుపు సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వారికి రుణాలు అందించి, స్వయం ఉపాధి కల్పించే విధంగా తోడ్పాటునందించాలని సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కల్యాణ్ వర్మ, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జె.జుమైలాల్, చిట్ మేనేజర్ శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ చత్రు అంబోతు, సిబ్బంది రమేష్‌బాబు, మహేందర్, రమేశ్, స్థానికులు పాండురంగారెడ్డిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ బ్యాంకు కొత్త భవనాన్ని ప్రారంభిస్తున్న భాస్కర్‌రావు

పర్యావరణ రక్షణకు సహకరించాలి



కడ్తాల్: మొక్కలు పంపిణీ చేస్తున్న నాయకులు

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీటీసీ చంద్రమౌళి అన్నారు. శనివారం మండలంలోని మక్తమాధారంలో హరితహారంలో భాగంగా స్థానిక యువకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ.. కాలుష్యరహిత సమాజం కోసం మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు లాయక్, చెన్నయ్య, జర్నలిస్ట్ రామకృష్ణ, రమేశ్, మల్లేశ్, యాదయ్య, శివ, అంజయ్య, రాములు ఉన్నారు.

జీపీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు

తలకొండపల్లి: పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి తక్షణమే పర్మినెంట్ చేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు పేర్కొన్నారు. కనీసం వేతనం రూ.19,500 ఇవ్వాలన్నారు. శనివారం కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పని చేస్తున్న పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని అన్నారు. జీఓ నంబర్51ను సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి, పాత కేటగిరి విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. కారోబార్, బిల్లు కలెక్టర్‌లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని పీఎఫ్, ఈఎస్‌ఐ, రూ.10 లక్షల ప్రమాదబీమా, తదితర సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కురుమయ్య, గొర్ల కాపరుల సంఘం జిల్లా నాయకులు పెంటయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటయ్య, డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, సీఐటీయూ మండల కోకన్వీనర్ రవణీల, కార్మికుల అధ్యక్షురాలు యాదమ్మ, కోకన్వీనర్ రవలి, సభ్యులు యాదమ్మ, భిక్షపతి, అలివేలు పాల్గొన్నారు.



తలకొండపల్లి: శిబిరంలో మాట్లాడుతున్న పాండు, తదితరులు

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

హయత్‌నగర్: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం 10వ రోజుకు చేరింది. కార్మికులు హయత్‌నగర్‌లోని మండల పరిషత్ ఆవరణలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు నర్సింహా మాట్లాడుతూ.. కార్మికులకు నెలకు రూ.15600 వేతనం ఇవ్వాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలన్నారు. అలాగే పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, కనకయ్య, శివకుమార్, అంజయ్య, లలిత, వెంకటమ్మ పాల్గొన్నారు.

వెట్టి చాకిరి చేస్తున్నాం..

కడ్తాల్: జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల వేతనాలు పెంచాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆశీర్వాదం, జీపీ కార్మికులు మహేశ్, లక్ష్మమ్మ, లక్ష్మయ్య, సరస్వతి, చంద్రకళ, యాదయ్య, పద్మమ్మ , చెన్నయ్య, రవి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

మంచాల: జీపీ కార్మికుల సమస్యలను పట్టించుకోకపోతే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పతనం తప్పదని సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎర్ర అశోక్ అన్నారు. శనివారం దీక్ష చేస్తున్న కార్మికులకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని రకాల సేవలు అందించడంలో కార్మికుల శ్రమ ఎంతో ఉందన్నారు. ఏళ్ల తరబడిగా వెట్టి చాకిరి చేస్తున్నారని చెప్పారు. కనీసం వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ, గ్రామ పంచాయతీ కార్మిక యూనియన్ నాయకులు ఖాజా పాషా, భాస్కర్, జంగయ్య, సురేష్, శంకరయ్య, చెన్నయ్య, సుజాత, నర్సమ్మ, మల్లేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



హయత్‌నగర్: మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు



కడ్తాల్: సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు



మంచాల: సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

క్షుద్రపూజల కలకలం



జమ్మిచెట్టుకు కట్టిన నల్లని వస్త్రం

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని జమ్మిచెట్టుకు గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు శనివారం కలకలం రేపింది. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహిళా బ్యాంకు, పీఆర్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, విద్యావనరుల కేంద్రం, ఐకేపీ కార్యాలయాలతో పాటు న్యాయస్థానాలున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ అరుగు పక్కన జమ్మిచెట్టు ఉంది. శుక్రవారం సాయంత్రం పాఠశాలలకు డిజిటల్ పరికరాలు, సైన్స్ సామగ్రి పంపిణీ కార్యక్రమం అక్కడే నిర్వహించారు. శనివారం ఉదయం జమ్మిచెట్టు వద్ద ఉప్పు పోసి పసుపు, కుంకుమ చల్లి, నిమ్మకాయలు కోసి కొబ్బరికాయలు కొట్టి హారతి వెలిగించిన దృశ్యాలు దర్శనమిచ్చాయి. అంతేగాక ఓ మూట మాదిరిగా ఉన్న నల్లని బట్టకు(వస్త్రం) పసుపు కుంకుమలు పూసి జమ్మిచెట్టుకు కట్టి ఉండడం తీవ్ర కలకలం రేపింది. ఆయా కార్యాలయాలకు వచ్చిన పలువురు సిబ్బంది, ప్రజలు చూసి భయాందోళనలకు గురైయ్యారు. మహిళ బ్యాంకు వద్ద సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి పనిచేయకపోవడంతో ఎవ్వరూ పూజలు చేసారనే విషయం స్పష్టం కాలేదు. కార్యాలయ వాచ్‌మెన్ తాను ఉదయం చూసేసరికి ఈ జమ్మిచెట్టుకు పూజలు చేసినట్లు కనపడిందని చెప్పాడు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.